క్లుప్తంగా

ఉపాధి కూలీల సంఖ్య పెంచాలి

పాలసముద్రం: ఉపాధి హామీ పథకంలో కూలీల సంఖ్య పెంచాలని ఏపీడీ సుబ్రమణ్యం తెలిపారు. మంగళవారం ఉపాధి హామీ కార్యాలయంలో ఏపీఓ మార్గరెట్ ఆధ్వర్యంలో ఉపాధిహామీ సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఏపీడీ సుబ్రమణ్యం మాట్లాడుతూ ప్రస్తుతం మండలంలో ఉపాధిహామీ కూలీలు తక్కువగా పనులు చేస్తున్నారని తెలిపారు. ప్రతి పంచాయతీలో రెండు వందల మందికి పైగా కూలీలకు పనులు కల్పించాల్సి బాధ్యత ఫీల్డ్ అసిస్టెంట్లుపై ఉందని తెలిపారు. కార్యక్రమంలో టెక్నికల్ అసిస్టెంట్లు రఘు నాయక్, బాబు తదితరులు పాల్గొన్నారు.

గుర్తింపు సంఖ్య కోసం నమోదు చేసుకోండి

గంగాధరనెల్లూరు: వ్యవసాయ ప్రత్యేక గుర్తింపు కార్డు కోసం రైతులకు ఆన్‌లైన్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు మండల వ్యవసాయ అధికారి భవాని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలో 13,500 మంది రైతులు ఉన్నారని, ఆయా సచివాలయాల పరిధిలో వ్యవసాయ సిబ్బంది ద్వారా 2869 మంది రైతులకు మంగళవారం నాటికి ఆన్‌లైన్ పూర్తయినట్లు తెలిపారు. ఈ నెల 27వ తేదీ లోపు సద్వినియోగం చేసుకోవాలని రైతులకు ఆమె పిలుపునిచ్చారు.

ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించాలి

పాలసముద్రం: గ్రామ సంఘాల అధ్యక్షులు ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించాలని ఐకేపీ ఏపీఎం కల్పలతరెడ్డి తెలిపారు. మంగళవారం పాచపాల్యం యూనిట్‌లోని గ్రామ సంఘ అధ్యక్షులకు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించి, ప్రతిజ్ఞ చేశారు. ఆమె మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయంలో చెరకు సాగుచేసి అందులో వస్తున్న బెల్లం తిరుమల, తిరుపతి దేవస్థానం తీసుకోవడానికి సిద్ధంగా ఉందని తెలిపారు. ద్రవ, ఘన జీవామృతాలు, కషాయాలతో పండించే విధానాలపై అవగాహన కల్పించారు.

మృతుని కుటుంబానికి పరామర్శ


నివాళులర్పిసున్న కుమారస్వామిరెడ్డి

నింద్ర: మండలంలోని అత్తూరు గ్రామం చెందిన వైఎస్ఆర్ సీపీ నాయకుడు దామురెడ్డి మామ చెంగల్రాయరెడ్డి మంగళవారం మృతి చెందారు. మృతదేహానికి మాజీ మంత్రి ఆర్కే రోజా సోదరుడు కూమారస్వామిరెడ్డి పూల మాల వేసి నివాళులర్పించారు. వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఎంపీపీ దీప, వైస్ ఎంపీపీ శుభ, రాష్ట్ర యవజన విభాగం ప్రధాన కార్యదర్శి శ్యామ్‌లాల్, జిల్లా కార్యదర్శి అనిల్, నాయకులు రామచంద్రారెడ్డి, వేణురాజు తదితరులు పాల్గొన్నారు.

మహిళల రక్షణ కోసం ప్రత్యేక కేంద్రం

పాలసముద్రం: మహిళల రక్షణ కోసం సఖీ వన్‌స్టాప్ సెంటర్‌ని తీసుకొచ్చారని ఎంపీడీఓ కృష్ణమహేష్‌రెడ్డి, సీడీపీఓ వినీతాశ్రీ తెలిపారు. మంగళవారం ఎంపీడీఓ కార్యాలయంలో మహిళా పోలీసులకు జిల్లా వన్‌స్టాప్ సెంటర్ అడ్మిన్ సంధ్యరాణి ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు.

అన్నదాతలకు విశిష్ట గుర్తింపు సంఖ్య

పాలసముద్రం: ఇక నుంచి రైతులకు ఆధార్ తరహాలో పత్యేక గుర్తింపు సంఖ్య కేటాయించేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపట్టిందని జిల్లా వ్యవసాయాధికారి మురళీకృష్ణ తెలిపారు. మంగళవారం మండల వ్యవసాయాధికారి ఢిల్లీప్రసాద్ సమక్షంలో కొనసాగుతున్న కార్యక్రమాన్ని ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు.

అంగన్‌వాడీలకు శిక్షణ

పుత్తూరు: మూడు నుంచి ఆరు సంవత్సరాల పిల్లలను పాఠశాలకు సంసిద్ధులు చేయడంపై అంగన్‌వాడీలు, ఉపాధ్యాయులు కీలక పాత్ర పోషించాలని ఎంఈఓ తిరుమలరాజు సూచించారు. మంగళవారం స్థానిక బాలికల ఉన్నత పాఠశాలలో ఆరు రోజుల శిక్షణా తరగతులను ఆయన ప్రారంభించారు. డైట్ లెక్చరర్ అనిత, ఎంఈఓ-2 బాలసుబ్రమణ్యం, డీఆర్‌పీలు రమేష్, వెంకటేష్, భూపతి, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు గీతాంజలి, సంధ్య, అనిత, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

వృద్ధురాలి మెడలో బంగారు గొలుసు చోరీ

పుత్తూరు: అద్దెకు ఇల్లు కావాలంటూ ఇంట్లోకి ప్రవేశించిన ఓ దుండగుడు ఒంటరిగా ఉన్న వృద్ధురాలి మెడలోని బంగారు గొలుసు లాక్కెళ్లిన సంఘటన మంగళవారం రాత్రి స్థానిక షాపువీధి ఎక్స్‌టెన్షన్‌లో చోటు చేసుకొంది. ఎస్‌ఐ ఓబయ్య కథనం మేరకు 25 నుంచి 30 ఏళ్ల వయస్సు కలిగిన యువకుడు భారతమ్మ అనే వృద్ధురాలితో మాటలు కలిపి, ఆమె మెడలోని 3 సవర్ల బంగారు గొలుసును లాక్కెళ్లాడు. ఈ మేరకు భారతమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

పాషాణ ప్రయోగం

తిరుపతి జిల్లా, వడమాలపేట మండలం కల్లూరు పంచాయతీని కాలుష్యం చుట్టుముట్టేసింది. కల్లూరుకి కూత వేటు దూరంలో పదికి పైగా కెమికల్ ఫ్యాక్టరీలు ఉన్నాయి. ఈ ఫ్యాక్టరీల నుంచి వచ్చే వ్యర్థపు నీరు కాలువల ద్వారా కుంటలు, చెరువులోకి చేరుతోంది. దీంతో నీరు కలుషితమవుతోంది. వాటిని తాగిన మూగజీవాలు మృత్యువాత పడుతున్నాయి. భూసారం కోల్పోయి, పంటలు పండడం లేదు. తాగునీరు కలుషితం కావడంతో ప్రజలు అనారోగ్యం బారిన పడుతున్నారు. – వడమాలపేట(విజయపురం)


కల్లూరు సమీపంలో ఉన్న కెమికల్ ఫ్యాక్టరీ

- కల్లూరు చుట్టుకున్న ఫ్యాక్టరీ వ్యర్థాలు
- ప్రాణాంతకంగా మారుతున్న కాలుష్యం
- చెరువులు, కుంటల్లో నీరు కలుషితం
- మృత్యువాత పడుతున్న మూగజీవాలు
- సారం కోల్పోతున్న భూములు
- ప్రమాదకర ఫ్యాక్టరీల్లో కూలీలుగా రైతులు
- నిబంధనలు పట్టించుకోని పరిశ్రమలు

వడమాలపేట మండలం, కల్లూరు పంచాయతీలో 300 కుటుంబాలు నివాసం ఉంటున్నారు. వీరందరికీ వ్యవసాయమే జీవనాధారం. కల్లూరుకు కూత వేటు దూరంలో ఉన్న గాజులమండ్యంలో 13కి పైగా కెమికల్ ఫ్యాక్టరీలు ఉన్నాయి. వాటి నుంచి వచ్చే వ్యర్థ పదార్థాలతో జల కాలుష్యం ఈ ప్రాంత ప్రజలకు ముప్పుగా మారింది. పరిశ్రమల నుంచి వెలువడుతున్న కాలుష్య వ్యర్థాలు చెరువులు, మూగజీవాలకు హాని చేస్తున్నాయి. కెమికల్స్ కలిసిన వ్యర్థాలు చెరువులు, కుంటల్లోకి వచ్చి చేరుతుండడంతో ఆ నీటిని తాగిన మూగజీవాలు మృత్యువాత పడుతున్నాయి. కొందరు శ్వాసకోశ వ్యాధులతో ఇబ్బందులు పడుతున్నారు. మరి కొందరు ఏదో ఒక ఆరోగ్య సమస్యతో బాధ పడుతున్నారు. కొందరైతే ఊరును విడిచిపెట్టి పట్టణాలకు వెళ్లిపోయారు. భూసారం కోల్పోవడంతో రైతులు వ్యవసాయం మానేసి అదే ఫ్యాక్టరీలలో దినసరి కూలీలు, సెక్యూరిటీ గార్డులుగా పని చేయాల్సిన దుస్థితి ఏర్పడిందని స్థానిక ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


పరిశ్రమ నుంచి వెలువడుతున్న వ్యర్థపు నీరు


ముళ్లపొదల్లో నిల్వ చేసి ఉన్న వ్యర్థపు నీరు

పట్టించుకోని అధికారులు

ఫ్యాక్టరీల ఉత్పత్తుల వివరాలు, వ్యర్థాలను పీసీబీ (పొల్యూషన్ కంట్రోల్ బోర్డు) అధికారులు గుర్తించాల్సి ఉంది. ఆ వ్యర్థాలను శుద్ధి కేంద్రాలకు తరలించాలి. ఈటీపీలో ప్రతి ఫ్యాక్టరీ సభ్యత్వం ఉందా లేదా అనేది పర్యవేక్షించాల్సి ఉంటుంది. అయితే ఇలాంటి నిబంధనలు ఎక్కడా కనిపించడం లేదు. కెమికల్ ఫ్యాక్టరీల నుంచి వెలువడే వ్యర్థాలను నేరుగా కాలువల ద్వారా విడిచి పెట్టేస్తునానరు. దీంతో కుంటలు, చెరువు కలుషితమవుతున్నాయని స్థానిక ప్రజలు వాపోతున్నారు.

ఇవీ నిబంధనలు

గాజులమండ్యం ఫ్యాక్టరీల చుట్టూ జరుగుతున్న సంఘటనలు చూస్తే పరిశ్రమల యాజమాన్యాలు రూల్స్ పాటించడం లేదన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఫ్యాక్టరీల యాజమాన్యాలు రోజుకి లక్ష లీటర్లకు పైగా మంచి నీటిని వాడుతున్నారు. ఆ ఫ్యాక్టరీల నుంచి వెలువడే వ్యర్థపు నీటిని స్టోర్ చేసి ఈటీపీ ప్లాంట్‌కు పంపించాలి. అక్కడ వాటిని శుద్ధి చేసి వివిధ రూపాల్లో బయటకు వదులుతారు. దీనికి ఫ్యాక్టరీల యాజమాన్యానికి లక్షల్లో ఖర్చు అవుతుంది. అయితే ఈ నిబంధనలను పరిశ్రమం యాజమాన్యాలు పాటించడం లేదు. రోజుకి లక్షల లీటర్ల వ్యర్థాలను కాలువల ద్వారా వదిలిపెట్టేస్తున్నారు. దీంతో చుట్టుపక్కల గ్రామాలు కాలుష్యం కోరల్లో చిక్కుకుంటున్నాయి. అంతేకాకుడా మూగజీవులు, ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారు.

అవగాహనతో క్షయ వ్యాధి దూరం


అవగాహన కల్పిస్తున్న డాక్టర్ సోమశేఖర్

విజయపురం: క్షయ వ్యాధి(టీబీ)పై సంపూర్ణ అవగాహన ఉంటే దాన్నుంచి రక్షణ పొందవచ్చునని డాక్టర్ సోమశేఖర్ అన్నారు. మంగళవారం కలియంబాకం సర్పంచ్ విద్య అధ్యక్షతన నగరి టీబీ యూనిట్ పరిధిలో బ్రీత్ సెఫ్ 360 టీడీ అలర్ట్ ఇండియా వారి సహకారంతో టీబీ క్యాంప్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా 50 మందికి టీబీ పరీక్షలు చేశారు. అనంతరం డాక్టర్ సోమశేఖర్ మాట్లాడుతూ క్షయ వ్యాధి బారినపడితే ఊపిరితిత్తులు చెడిపోయి. ఆయాసం, దగ్గు, తరచూ జ్వరం వస్తుందన్నారు. వ్యాధి ముదరక ముందే తగిన చికిత్స తీసుకోవాలన్నారు. క్షయ వ్యాధిని కట్టడి చేయకపోవడానికి ప్రధాన కారణం రోగుల నిర్లక్ష్యమేనని ఎస్ఐ బలరాం అన్నారు. డాక్టర్ విష్ణుప్రియ, సీహెచ్ఓ సుబ్బరామమ్మ, పీహెచ్ఎన్ భారతి, ఏఎస్ఐ గోవిందరాజులు, సెక్రటరీ గాయత్రి, ఎంపీహెచ్ఎస్ మురళి, టీబీ యూనిట్ సభ్యులు శ్రీనివాస్, పవన్, దేవిప్రియ, జయశ్రీ, ఏఎస్ఎంలు సునీత, జీవ, హేమలత, గీత, ఆశ వర్కర్లు కుమారి, మునిభూషణం తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి మాజీ మంత్రి భరోసా



బాధిత కుటుంబానికి పరామర్శ, ఆలయానికి రూ.లక్ష బహుమతిగా అందిస్తున్న ఆర్కేరోజా

నగరి: ప్రభుత్వ భూముల ఆక్రమణ అంశాన్ని ప్రశ్నించినందుకు టీడీపీ గూండాల చేతిలో గాయాలపాలై ఆస్పత్రిలో చికిత్స పొంది, ఇంటికి చేరుకున్న బీరకుప్పం సర్పంచ్ సెల్వి భర్త మునస్వామిని మాజీమంత్రి ఆర్కేరోజా పరామర్శించారు. మంగళవారం వారి స్వగృహానికి చేరుకున్న ఆమె మునస్వామి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. వారి కుటుంబానికి ధైర్యం చెప్పారు. అధైర్య పడాల్సిన అవసరంలేదని తాను అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. దాడికి పాల్పడిన వారికి న్యాయస్థానం ద్వారా శిక్ష పడేలా చేస్తామన్నారు. ఆమె వెంట వైస్ ఎంపీపీలు కన్నియప్ప, ఢిల్లీ, సర్పంచ్‌లు రవికుమార్, నాయకులు బుజ్జిరెడ్డి, జగన్‌మోహన్ రెడ్డి, వెంటేశులు, సుమన్, కుట్టి, హరి, జయరామన్, రాము తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా శ్రీకృష్ణ మందిర మహాకుంభాభిషేకం

పుత్తూరు: పట్టణ పరిధిలోని తిమ్మాపురం గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీకృష్ణ మందిరం మహా కుంభాభిషేక ఉత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. మంగళవారం మాజీ మంత్రి, వైఎస్ఆర్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఆర్కే రోజా మహా కుంభాభిషేకం, ఆలయ అష్టబంధన, గణపతిపూజ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. రోజా చారిటబుల్ ట్రస్టు తరపున రూ.లక్ష నగదును ఆలయానికి బహుమతిగా అందజేశారు. తొలుత ఆలయ నిర్వాహకులు మాజీమంత్రికి ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ఆమెకు తీర్థ ప్రసాదాలు అందజేసి సత్కరించారు. వైఎస్ఆర్ సీపీ నాయకులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

వైఎస్ఆర్ సీపీఅండగా ఉంటుంది


మునస్వామిని పరామర్శిస్తున్న ఆర్కే రోజా

పుత్తూరు: ఆత్మీయులను కోల్పోయినవారి కుటుంబాలకు వైఎస్ఆర్ సీపీ అండగా ఉంటుందని మాజీ మంత్రి ఆర్కే రోజా భరోసా ఇచ్చారు. పట్టణ పరిధిలోని నెత్తం గ్రామానికి చెందిన వైఎస్ఆర్ సీపీ నాయకుడు చిన్నదొరై సుబ్రమణ్యం భార్య మునిరాజమ్మ ఇటీవల మృతి చెందారు. మంగళవారం ఆర్కే రోజా గ్రామానికి వెళ్లి మునిరాజమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆప్తులను కోల్పోయినా మనోధైర్యంతో ముందుకెళ్లాలని, పార్టీ అన్ని వేళలా అండగా ఉంటుందని కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు.

శ్రీబంగారమ్మకు ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకరణలో శ్రీబంగారమ్మ

కార్వేటినగరం: నగరం ప్రజలు కొంగుబంగారంగా కొలిచే శ్రీబంగారమ్మ ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి అర్చనలు, అభిషేకాలు చేపట్టారు. అనంతరం అమ్మవారిని పట్టు వస్త్ర, సుగంధ భరిత పుష్పమాలికలు, విశేష ఆభరణాలతో ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. పురుషోత్తం మొదలియార్ కుటుంబ సభ్యులు చిన్నారిని ఆలయంలో తులాభారం నిర్వహించి అమ్మవారికి మొక్కులు తీర్చుకున్నారు. సాయిబాలాజీ నగర్‌లో వెలసి ఉన్న శ్రీషిరిడీ సాయినాథుని ఆలయంలో కూడా చిన్నారికి తులాభారం నిర్వహించారు. ఆలయ అధ్యక్షుడు ప్రసాద్ తీర్థ ప్రసాదాలను అందించారు. ఆలయ ఉపాధ్యక్షుడు రంగనాథమొదలియార్, కార్యదర్శి చంద్రశేఖర్ పిళ్లై పాల్గొన్నారు.

పోలీస్ స్టేషన్‌కు 15 బారికేడ్లు


బారికేడ్లు అందుకుంటున్న సీఐ

నగరి: స్థానిక పోలీస్ స్టేషన్‌కు ట్రాఫిక్ నియంత్రణ కోసం క్రెడిట్ యాక్సెస్ ఇండియా ఫౌండేషన్, క్రెడిట్ యాక్సెస్ గ్రామీణ లిమిటెడ్ కంపెనీ వారు 15 బారికేడ్లను అందజేశారు. మంగళవారం స్టేషన్‌కు విచ్చేసిన వారు బారికేడ్లను సీఐ మహేశ్వర్‌కు అందజేశారు. ఈ సందర్భంగా సీఐ దాతలను అభినందించారు. రోడ్డు ప్రమాదాల నివారణ, ట్రాఫిక్ నియంత్రణ, ప్రజల రక్షణ తదితర అంశాల్లో బారికేడ్లు ఉపయోగపడతాయన్నారు. ఈ కార్యక్రమంలో కంపెనీ ప్రతినిధులు తిరుపతి డీఎం జగదీష్, ఏరియా మేనేజర్ సిద్ధారెడ్డి, బ్రాంచ్ మేనేజర్ వెంకటాచలపతి, పోలీసులు పాల్గొన్నారు.

వివాదాస్పద క్వారీలో సర్వే



వివాదాస్పద క్వారీ వద్ద అధికారులు, పనులు నిర్వహించకుండా రోడ్డుకు అడ్డంగా హిటాచీ వాహనం

శ్రీరంగరాజపురం: మండలంలోని పద్మపురం రెవెన్యూ లెక్క దాఖలలోని వివాదాస్పద క్వారీని జిల్లా మైన్స్, రెవెన్యూ, పోలీసు అధికారులు ఉమ్మడిగా తనిఖీ చేసి, సర్వే నిర్వహించారు. జిల్లా మైనింగ్ సర్వే అధికారి అజిత తెలిపిన వివరాలిలా ఉన్నాయి. 55 పద్మపురం రెవెన్యూ లెక్కదాఖలలో పిల్లాగుండ్లపల్లికి చెందిన గుణశేఖర్‌నాయుడు భార్య మోహనమ్మకు 1992 సంవత్సరంలో సర్వే నంబర్ 165/1లో 4.90 ఎకరాలకు డీకేటీ పట్టా ఇచ్చారు. దీని పక్కన ఉన్న సర్వే నంబర్ 201/1లో 2017 సంవత్సరం మణినాయుడుకు 1.90 హెక్టర్లు దాదాపు 5 ఎకరాల వరకు క్వారీ అనుమతులు మంజూరే చేశారు. మణినాయుడు మరణించడంతో అతని కుమారుడు భానుప్రసాద్‌కి 2024 సంవత్సరం నవంబర్‌లో అనుమతులు ఇచ్చారు. ఈ భూమిలో శేఖర్‌బాబు అనే వ్యక్తి తనకు లీజుకు ఇచ్చారని క్వారీ పనులు నిర్వహిస్తున్నారు. సంబంధిత క్వారీ వివాదాస్పదం కావడంతో భానుప్రసాద్, గుణశేఖర్ భార్య మోహనమ్మ జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. కలెక్టర్ ఆదేశాలతో మైనింగ్ అధికారులు, రెవెన్యూ, పోలీసు అధికారులు ఉమ్మడిగా తనిఖీ చేసి సర్వే నిర్వహించారు. నివేదికను జిల్లా కలెక్టర్‌కు అందిస్తామన్నారు. అంత వరకు క్వారీ పనులను నిర్వహించకూడదని తెలిపారు. సీఐ హనుమంతప్ప, తహశీల్దార్ లోకనాథపిళ్లై, మైన్స్ ఆర్ఐ శ్రీనివాసులు, టీపీ సోమశేఖర్, రెవెన్యూ ఆర్ఐ ప్రభాకర్, సర్వేయర్ సురేష్‌బాబు, తులసి పాల్గొన్నారు.

అధికారుల ఆదేశాలు బేఖాతరు



ప్రభుత్వ స్థలంలో అక్రమ నిర్మాణం, నిర్మాణాన్ని అడ్డుకుంటున్న రెవెన్యూ అధికారులు(ఫైల్)

శ్రీరంగరాజపురం: కబ్జా చేసిన ప్రభుత్వ భూమిని రెవెన్యూ అధికారులు గతంలో స్వాధీనం చేసుకున్నారు. అయితే కూటమి ప్రభుత్వం అండదండలతో ఓ టీడీపీ నాయకుడు మళ్లీ అక్రమ నిర్మాణాలు చేస్తున్నాడు. మంగుంట గ్రామం స్థానికుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. మంగుంట రెవెన్యూ లెక్కదాఖల 19/1, 19/2లో 9 సెంట్లు ప్రభుత్వ భూమిని పాల సేకరణ కోసం, గ్రామ అవసరాలకు కేటాయించారు. ఈ భూమిపై ఓ టీడీపీ నాయకుడి కన్ను పడింది. ఈ స్థలాన్ని ఆక్రమించుకుని అందులో గోకులం షెడ్డు నిర్మిస్తున్నాడు. గ్రామస్తులు జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. అప్పట్లో అక్రమ నిర్మాణాన్ని రెవెన్యూ అధికారులు అడ్డుకున్నారు. అధికార బలంతో మళ్లీ ప్రభుత్వ స్థలంలో నిర్మాణాలు సాగిస్తున్నారు. అధికారులు రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గినట్లు గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.

అంగన్‌వాడీ సిబ్బందికి శిక్షణ


మాట్లాడుతున్న ప్రాజెక్టు డైరెక్టర్

నగరి: అంగన్‌వాడీ కార్యకర్తలకు సపోర్టింగ్ ఆంధ్రా లెర్నింగ్ ట్రాన్స్‌ఫర్మేషన్(సాల్ట్) కార్యక్రమంలో భాగంగా శిక్షణ అందించారు. మంగళవారం స్థానిక పీసీఎన్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఈ శిక్షణా కార్యక్రమం చేపట్టారు. రెండు విడతలుగా నిర్వహించనున్న ఈ శిక్షణలో తొలిరోజు ప్రాజెక్టు డైరెక్టర్ డి.వెంకటేశ్వరి పాల్గొన్నారు. జ్ఞాన జ్యోతి సర్టిఫికెట్ కోర్సులో భాగంగా అంగన్‌వాడీలోని కిందిస్థాయి సిబ్బందికి రాష్ట్ర పాఠశాల విద్య, మహిళాభివృద్ధి శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఈ శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆమె తెలిపారు. మండల విద్యాశాఖాధికారులు శ్రీదేవి, నమశ్శివాయం మాట్లాడుతూ మొదటి విడతగా మంగళవారం ప్రారంభమైన శిక్షణ 20వ తేదీ వరకు ఉంటుందన్నారు. సీడీపీఓ కృష్ణవేణి, సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ వర్కర్లు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన



వైద్య శిబిరానికి హాజరైన వైఎస్ఆర్ సీపీ నాయకులు, రోగులు, మాట్లాడుతున్న మాజీ ఎంపీ మహాసముద్రం జ్ఞానేంద్రరెడ్డి

పెనుమూరు(కార్వేటినగరం): మహాసముద్రం రామకృష్ణారెడ్డి చారిటబుల్ ఫౌండేషన్, చిత్తూరు లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం పులిగుండు వద్ద చిత్తూరు అపోలో హాస్పిటల్ వైద్యులతో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. మొత్తం 156 మంది రోగులకు వివిధ రకాల వైద్య పరీక్షలు నిర్వహించారు. పులిగుండు వద్ద మహాసముద్రం దినేష్‌రెడ్డి, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరానికి మంచి స్పందన లభించింది. 20 మంది యువకు రక్తదానం చేశారు. ఈ క్రార్యక్రమాన్ని చిత్తూరు మాజీ ఎంపీ మహాసముద్రం జ్ఞానేంద్రరెడ్డి, వైఎస్ఆర్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మహాసముద్రం దయాసాగర్‌రెడ్డి కలసి ప్రారంభించారు. మాజీ ఎంపీ మహాసముద్రం జ్ఞానేంద్రరెడ్డి మాట్లాడుతూ గతంలో మహాసముద్రం ఫౌండేషన్ ఈ ఏడాది ఏప్రిల్ నెలలో పులిగుండు వద్ద క్యాన్సర్ వైద్య శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. దయాసాగర్‌రెడ్డి మాట్లాడుతూ స్వచ్ఛందంగా రక్తదానం చేయడానికి ముందుకొచ్చిన యువకులను అభినందించారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్ సీపీ జడ్పీటీసీ సభ్యుడు జి.దొరస్వామి యాదవ్, మాజీ మండల కన్వీనర్ మహాసముద్రం సురేష్‌రెడ్డి, సింగిల్ విండో మాజీ అధ్యక్షుడు గోవిందరెడ్డి, నియోజకవర్గం అధికార ప్రతినిధి చక్రవర్తి నాయుడు, సర్పంచులు దూది వెంకటేష్, జయచంద్రారెడ్డి, వైఎస్ఆర్ సీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేట్ ఏజెన్సీలు వద్దు


నిరసన వ్యక్తం చేస్తున్న మున్సిపల్ కార్మికులు

నగరి: మున్సిపల్ కార్యాలయంలో పనిచేసే కార్మికులకు మున్సిపల్ శాఖ తరపునే జీతాలు చెల్లించాలని, వారికి వేతనాలు చెల్లించే ప్రక్రియను ప్రైవేట్ ఏజెన్సీలకు అప్పగించరాదని వర్కర్స్ యూనియన్ గౌరవ అధ్యక్షుడు, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోదండయ్య డిమాండ్ చేశారు. మంగళవారం కార్మికులతో కలిసి మున్సిపల్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ కృష్ణారెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపల్ ఉద్యోగ, కార్మికుల వేతనాల చెల్లింపు, పనుల అప్పగింత, నిర్వహణ, సాంఘిక భద్రతపై మున్సిపల్ శాఖకే పూర్తి బాధ్యతలు ఉండాలన్నారు. ప్రైవేట్ ఏజెన్సీలకు అప్పజెప్పరాదన్నారు. అలాగే సమ్మె సందర్భంగా ఇంజినీరింగ్ కార్మికులకు వేతనాలు పెంచుతామని ఇచ్చిన హామీని నెరవేర్చాలన్నారు. జనాభా ప్రాతిపదికన శానిటేషన్ కార్మికులను పెంచాలన్నారు. మున్సిపల్ కార్మికుల్లో పది మందికి పైగా మరణించారని, వారి కుటుంబ సభ్యులకు, పిల్లలకు పీఎఫ్ క్లెయిమ్‌లు ఇంతవరకు అందలేదన్నారు. ఈఎస్ఐ కార్డులు అందించలేదన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ పట్టణ కార్యదర్శి వేలన్, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ కార్యదర్శి మురళి, ఏఐటీయూసీ పట్టణ నాయకులు బాషా, శేఖర్, ఏసు, మున్సిపల్ యూనియన్ నాయకులు నాగరాజు, సతీష్, చిన్న రాసు, సుబ్రహ్మణ్యం, రవి, హనుమంతు తదితరులు పాల్గొన్నారు.

నేడు బ్రాహ్మణ సంఘ భవనం ప్రారంభం



పుత్తూరు: మండల పరిధిలోని శిరుగురాజుపాళెం వద్ద నూతనంగా నిర్మించిన శ్రీగాయత్రిదేవి బ్రాహ్మణ సంక్షేమ సమాఖ్య భవనాన్ని ప్రారంభిస్తున్నట్లు సంఘ అధ్యక్ష, గౌరవాధ్యక్షులు రమేష్ పురోహిత్, రామకృష్ణ తెలిపారు. ఉదయం 5 గంటలకు విఘ్నేశ్వర పూజ, గోపూజ, ప్రవేశ ముహూర్తం, వాస్తు, నవగ్రహవణం, లక్ష్మీగణపతి హోమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 10 గంటలకు శ్రీసీతారాముల కల్యాణోత్సవం వేదపండితులతో శాస్త్రోక్తంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. శుభకార్యాలకు భవనాన్ని తాత్కాలిక రుసుముతో అద్దెకు ఇవ్వనున్నట్లు తెలిపారు.

రోడ్డు వేయించండి సారూ..



వడమాలపేట తహశీల్దార్ కార్యాలయం ఎదుట మహిళల నిరసన, అధ్వానంగా ఉన్న వడమాల ఆదిఆంధ్రవాడ అంతర్గత రోడ్డు

వడమాలపేట (విజయపురం): వడమాల ఆదిఆంధ్రవాడకు వెళ్లే అంతర్గత రోడ్డుకు మరమ్మతులు చేయాలంటూ అక్కడి స్థానికులు పసిబిడ్డలతో సహా మంగళవారం తహశీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తిరుపతి రోడ్డు నుంచి వడమాల ఆదిఆంధ్రవాడకు వెళ్లే అంతర్గత రోడ్డు అధ్వానంగా ఉందని తెలిపారు. అడుగడుగునా పెద్దపెద్ద గుంతలు ఉన్నాయని, ద్విచక్ర వాహనదారులు సైతం ప్రమాదాలకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అత్యవసర పరిస్థితిలో 108 వాహనం ఊరు లోపలకు రావడం లేదన్నారు. గర్భవతులు ఆసుపత్రికి నడిచి వెళ్లాల్సిన దుస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు, నాయకులు సైతం తమ సమస్యలను పట్టించుకోవడం లేదని ఆరోపించారు. అధికారులు పట్టించుకోకపోతే రోడ్డుపై రాస్తారోకో చేస్తామని హెచ్చరించారు. అనంతరం తహశీల్దార్ జరీనాకు వినతిపత్రం అందించారు. రోడ్డుకు ఇరువైపులా పట్టా భూములు ఉన్నాయని. రైతులతో మాట్లాడి న్యాయం చేస్తామని తహశీల్దార్ జరీనా తెలిపారు.